# అమర్త్యసేన్ సరళీకరణకు మెరుగులు దిద్దుతున్నాడా?

డా. బాలగోపాల్

అమర్త్యసేన్‌కు నోబెల్ బహుమతి లభించడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్న చర్చ వామపక్షాలలో జరుగుతున్నది. ఆయనను మరొక కీన్స్ (Keynes) గా చూడాలా? అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఒక ఉపశమన మార్గాన్ని సూచించిన వ్యక్తిగా అర్థం చేసుకోవాలా? 1930 లలో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొన్న సంక్షోభానికి జవాబుగా కీన్స్ కొన్ని ప్రతిపాదనలు చేసాడు. మార్కెట్‌లో డిమాండ్‌ను పెంచడానికి ప్రభుత్వం చురుకుగా చర్యలు తీసుకోవాలని చెప్పాడు. ఆర్థిక రంగంలో ప్రభుత్వానికి ఏ పాత్ర లేదనీ 'మార్కెట్ శక్తుల'కే వదిలి పెడితే ఆశక్తులే కాగలపని చేసుకుపోతాయని చెప్పే సంప్రదాయక లిబరల్ ఆర్థిక సిద్ధాంతాలకిది విరుద్ధం. అయితే కీన్స్ ప్రతిపాదన పెట్టుబడి దారీ వ్యవస్థకు చాలా ఉపయోగపడింది. ఉత్పాదనకూ డిమాండ్‌కూ మధ్య అసమ తుల్యం ఏర్పడి ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు ప్రభుత్వం చొరవ తీసుకొని డిమాండ్‌ను పెంచే కార్యక్రమము చేపట్టాలనే ఆలోచన ఆనాటి నుండి పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక విధానాలలో భాగమయి పోయింది.

అమర్త్యసేన్ సేవలు ప్రస్తుత ప్రపంచీకరణ దశలో అదే పాత్ర నిర్వహిస్తున్నాయనీ, తద్వారా ఆయన ప్రస్తుత ప్రపంచ పెట్టుబడిదారీ వ్యూహాన్ని కాపాడడానికీ దానికి ప్రజలలో కొంత ఆదరణ కల్పించడానికి ఉపయోగపడుతున్నాడనీ, అందువల్లనే ఆయనకు నోబెల్ బహుమతి లభించిందనీ వాదిస్తున్న వాళ్లున్నారు. ఇంతటి కుట్రను ఊహించని వాళ్ల సహితం, అమర్త్యసేన్ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆచరించలేని సూచనలను ప్రతిపాదించడం ద్వారా అది వాటిని ఆచరించగలదేమో నన్న భ్రమలు కల్పిస్తున్నాడనీ, అందువల్లనే ఆయనకు నోబెల్ బహుమతి లభించిందనీ వాదిస్తున్నారు.

సామ్రాజ్యవాద ప్రయోజనాల కుతోడ్పడకపోతే నోబెల్ బహుమతి ఎందు కిస్తారు? అన్న ప్రశ్న దగ్గర మొదలు పెట్టి తర్కిస్తే అతను ఏ ప్రయోజనం చేకూరుస్తున్నాడో వెతికే పద్ధతిలోనే విశ్లేషణ జరుగుతుంది. కానీ పాశ్చాత్య దేశాలలో జరిగేదంతా సామ్రాజ్యవాద ప్రయోజనాల పరిరక్షణే కాదు. ఇక్కడ ఉన్నట్టే అక్కడ కూడా భిన్న ప్రయోజనాలున్నాయి, విభిన్నమైన విలువలున్నాయి, పరస్పర విరుద్ధమైన ఆలోచనలూ ఆకాంక్షలూ ఉన్నాయి. వీటిలో దేని ప్రభావం ఏమేరకు నోబెల్ బహుమతులకు ఎంపిక చేసే స్వీడిష్ అకాడమీ మీద ఉంటుందని నిర్ణయం చేయడానికి కావలసిన సమాచారం ఎవరి దగ్గరా లేదు. అంత మాత్రం చేత సామ్రాజ్యవాద ప్రయోజనాల 'ప్రభావమే' ప్రధాన మని నమ్మవలసిన అవసరమేమీ లేదు. నిజమే, ఇప్పటిదాకా అర్థ శాస్త్ర బహుమతి పెట్టుబడి దారీ ప్రయోజనాలకు నష్టకరమైన ఆలోచనలు చేసిన వారికెవ్వరికీ ఇవ్వలేదు. జోన్ రాబిన్సన్‌కు సహితం ఇవ్వలేదు. అటువంటిది ఇప్పుడు అమర్త్య సేన్‌కు ఇచ్చారు. మళ్లీ వచ్చే సంవత్సరం నుండి పాత మూసలోకే పోవచ్చు. దీని వెనుక ఏవో కుట్రలు ఊహించు కోవడం కంటె అమర్త్యసేన్ ఆలోచనలు, ఆ ఆలోచనల లోని విలువలు ప్రజలకు ఏ మేరకు మేలు చేస్తాయెూ, ఏమేరకు దోహదం చేస్తాయెూ చర్చించుకోవడం మేలు.

కీన్స్ ఆలోచనలు మొట్టమొదట సంప్రదాయక బూర్జువా అర్థశాస్త్రాన్ని కొంత ఇబ్బంది పెట్టినప్పటికీ వేగంగానే ఆమోదం పొందాయి. పెట్టుబడి దారీ దేశాల ప్రభుత్వాల పాలనా విధానాలలో భాగమయ్యాయి. ఇప్పడవి కూడ 'సంప్రదాయక విధానాలు' అయిపోయాయి. అమర్త్యసేన్ ఆలోచనలు సంపూర్ణంగా ఎప్పటికీ పెట్టుబడీ దారీ పరిపాలనా విధానాలలో భాగం కావు, కాలేవు. 'మానవ పెట్టుబడి' (హ్యూమన్ కేపిటల్) అనే భావనలో ఇమడగల కొన్ని అంశాలు మాత్రం కాగలవు. అవయినా ఏ మేరకు నిజంగా పెట్టుబడిదారీ పాలనా విధానాలలో భాగమవుతాయనేది వేచి చూడవలసిందే.

కీన్స్ ప్రత్యక్షంగానే పెట్టుబడి దారీ ఆర్థిక మాంద్యానికి జవాబు వెతికే కర్తవ్యాన్ని తన ముందు పెట్టుకున్నాడు. అయితే సృజనాత్మక మైన ఆలోచనా శక్తి ఉన్నవాడు కాబట్టి సంప్రదాయవిరుద్ధంగా ఆలోచించాడు. అమర్త్యసేన్ చేసింది అది కాదు. ఆయన ఎంపిక చేసుకున్న సమస్య ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏ విధంగా పరిష్కరించాలన్నది కాదు. దాని వల్ల దెబ్బతింటున్న ప్రజలకు కొంత ఉపశమనం కల్పించి ప్రపంచీకరణకు ప్రజామోదం తెచ్చిపెట్టాలంటే ఏం చేయాలన్నది కాదు.

అమర్త్యసేన్ కేవలం అర్థశాస్త్ర వేత్త కాడు. నైతికతత్వవేత్త కూడ. సమానత్వం, న్యాయం, మంచి మొదలయిన నైతిక భావనలపైన ఆయన చాలా లోతుగా తాత్విక చర్చచేసాడు. బహుశా ఆయన అర్థశాస్త్ర పరిశోధనల కంటే ఇదే ముఖ్య మైనదేమో (దీనికి నోబెల్ బహుమతి ఇచ్చే ఏర్పాటు లేకుండవచ్చుగాక). అయితే ఈ విలువల చర్చను ఆయన కేవలం అమూర్తంగా చేసి ఊరుకోకుండ అర్థశాస్త్రానికి అన్వయించి ఆర్థిక పరిస్థితుల, విధానాల విమర్శలో భాగం చేస్తాడు.

ఆయితే ఈ చర్చ చేసేటప్పుడు ఆయన విశ్లేషణ మార్క్సిస్టులకు అలవాటయిన పద్ధతిలో సాగదు. తాను నిర్వచించే విలువలు ఏ వ్యవస్థలో సాధ్యమవుతాయి? ఆ వ్యవస్థను అందుకోవాలంటే ఏం చేయాలి? అనే పద్ధతిలో సాగదు. సమానత్వం, న్యాయం, మంచి సంపూర్ణంగా సిద్ధించే 'వ్యవస్థ' నొకదానిని మనం ముందుగానే నిర్వచించుకొని దానికి కావలసిన బాటను నిర్దేశించుకోగలమన్న విశ్వాసమే సందేహాస్పదమయినదని ఈ శతాబ్దపు కమ్యూనిస్టు విప్లవ ప్రయత్నాల చరిత్ర సూచిస్తున్నది కాబట్టి అమర్త్యసేన్ ఆ పద్ధతిలో వివేచించక పోవడాన్ని తప్పపట్టనవసరం లేదు. దీని అర్థం, మనం ప్రతిపాదించే విలువలకూ మన చుట్టూ ఉన్న పరిస్థితులకూ మధ్యనున్న సంబంధాన్ని చూడకుండా ఉండాలని గానీ, చూడకుండ ఉండడం సాధ్యమని గానీ కాదు. కానీ దానికీ, ఒక 'విముక్తి' బాటను ప్రతిపాదించని నైతిక ఆలోచన పనికి రాదనడానికీ చాలా తేడా ఉంది.

అమర్త్యసేన్ పద్ధతి వేరు. ఆయన సమానత్వం, న్యాయం, మంచి మొదలైన విలువల గురించి లోతుగా చర్చ చేస్తాడు. ఇతర తత్వవేత్తలు వాటికి ఇచ్చిన నిర్వచనాలను విమర్శనాత్మకంగా పరిశీలిస్తాడు. అవి నిర్దిష్టమైన పరిస్థితులలో ఏ విధంగా పనికి రాకుండ పోతాయో, లేక వైరుధ్యాలకు దారితీస్తాయో చూపిస్తాడు. చివరికి తనదైన నిర్వచనాన్ని ప్రతిపాదిస్తాడు.

తాను ప్రతిపాదించే న్యాయం ఫలాన 'ఉత్పత్తివ్యవస్థ' లో మాత్రమే సాధ్యం అవుతుందని ఆయన అనడు. నిజానికి అది కేవలం ఉత్పత్తి వ్యవస్థకు సంబంధించిన విషయం కాదు. అయితే ఒక్కొక్క సామాజిక పరిస్థితులోనూ (అందులో ఉత్పత్తి వ్యవస్థేకాక ఇతర సాంఘిక వ్యవస్థలూ, పరిపాలనావ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, సాంస్కృతిక విలువలు కూడ ఉంటాయి) ఈన్యాయానికి ఉండే అవరోధాలను గుర్తిస్తాడు. ఈ గుర్తింపు ఆ పరిస్థితుల మీద బలమైన విమర్శ పెట్టడానికొక సాధనంగా పనిచేస్తుంది.

అమర్త్యసేన్ నైతిక చర్చకు ప్రాతిపదిక మనిషి. మనిషికి అప్పటి పరిస్థితిలో ఉండే శక్తి, అర్హత, యోగ్యత, అవకాశాలు ఆయనకు ప్రమాణం. వీటిని పెంచేది న్యాయం అనీ తగ్గించేది అన్యాయం అనీ అంటాడు. ఈ నిర్వచనంలో ఏ సమస్యలూ లేవని కాదు. నిజానికి న్యాయానికి సమానతకూ ఏ నిర్వచనం ఇచ్చినా దానిని అన్వయించేటప్పుడు ఏదో ఒక వైరుధ్యం ఎదురుకాకతప్పదనీ, అన్ని వైరుధ్యాలనూ అధిగమించే నిర్వచనం ఏదీ ఉండదనీ అమర్త్యసేన్ అంటాడు. దీని అర్థం న్యాయాన్ని గురించి, సమానత గురించి ఆలోచించడం మానేయాలని కాదు. నా దగ్గరే అసలయిన జవాబు ఉందన్న అహంభావాన్ని వదులుకోవాలని మాత్రమే. ఉన్నంతలో ఎక్కువ ప్రశ్నలకు జవాబు చెప్పగల నిర్వచనాన్నీ, ఎక్కువ సంతృప్తి ఇవ్వగల ఆలోచననూ కొంత వినయంతో స్వీకరించడంలో తప్పేమీ లేదు.

ప్రపంచీకరణ, సరళీకరణ క్రమాలు దేశంలో సామాన్య ప్రజల శక్తినీ, అవకాశాలనూ పెంచగలవని అమర్త్యసేన్ నమ్ముతాడు. అయితే ఇది జరగాలంటే ప్రజలకు కొంత ప్రాథమికమైన బలాన్ని అందిచ్చే చర్యలు ప్రభుత్వం అనుసరించాలంటాడు. వాటిలో విద్య, ఆరోగ్యం, సాంఘిక (ముఖ్యంగా లైంగిక) అసమానతల తొలగింపు లేక తగ్గింపు, విధాన నిర్ణయాలలో ప్రజలకు భాగస్వామ్యం, విధాన నిర్ణయాలను ప్రభావితం చేయడానికి అవసరమైన రాజకీయస్వేచ్ఛ మొదలయినవి ముఖ్య.మయినవి. వీటిని కల్పించే విధానాలు లేకుండా సరళీకరణ, ప్రపంచీకరణ చేపడితే దేశంలో పేదరికం, అసమానతలు, హింసా దౌర్జన్యాలు పెరిగే ప్రమాదం ఉందనీ ప్రస్తుతం భారత పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలు ఆ బాట మీదనే ఉన్నాయనీ అమర్త్యసేన్ అంటాడు.

ఇవన్నీ ఉన్నా, సరళీకరణ, ప్రపంచీకరణ ప్రజల బలాన్నీ అవకాశాలనూ నిజంగా (అంటే సమానతకు అమర్త్యసేన్ ఉపయోగించే ప్రమాణాలకు అనుగుణంగా) పెంచుతాయన్న ఆభిప్రాయంతో విభేదించ వచ్చును. అమర్త్యసేన్ వ్యక్తం చేసే ఈ ఆభిప్రాయం కార్పొరేట్ పెట్టుబడికి ఉండే బలాన్నీ దాని వికృతనైజాన్ని తక్కువగా అంచనా వేస్తుందని నా అనుమానం. అయినప్పటికీ ప్రపంచీకరణ వల్ల నిజంగా న్యాయం జరగాలంటే ఏమేమి చేయవలసి ఉంటుందో అవేవీ చేయకుండ ప్రపంచీకరణ బాట మీద దేశాన్ని పెట్టడం అసమానతల పెరుగుదలకూ పేదరికం పెరుగుదలకూ హింసాదౌర్జన్యాలకూ దారి తీస్తుందంటూ అమర్త్యసేన్ వివరంగా చేసే విమర్శ, భారత పాలకులు (ముఖ్యంగా మన చంద్రబాబు) అనుసరిస్తున్న విధానాలకొక చెంపపెట్టుగానే భావించాలి. అమర్త్యసేన్ విమర్శ ఈ విధానాలకు మెరుగులు దిద్దే హితోపదేశం కాదు. వాటిని తీవ్రంగా ఎండకట్టే విమర్శ. సవివరంగా, విశ్లేషణాత్మకంగా, చేసే ఈ విమర్శ పాలకుల విధానాలను వ్యతిరేకించే రాజకీయ కృషికి, ప్రజాఉద్యమాలకు చాలా బలం సమకూర్చగలదు. నిజానికి ఆయన పెట్టే విమర్శను చివరిదాకా తీసుకుపోతే అది ప్రపంచీకరణనే అసాధ్యం చేయగలదు. ఎందుకంటే న్యాయానికీ, సమానతకూ ప్రమాణంగా అమర్త్యసేన్ ప్రతిపాదించే 'ప్రజల సామర్థ్యం' అనే భావన (దాని సంపూర్ణ అర్థంలో) కార్పొరేట్ పెట్టుబడి నైజానికే విరుద్ధమైనది.